RNI NO: APTEL/25/A0108
www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక




ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 148, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2, /- శనివారం -29 - ఆగష్టు - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## నేపాల్‌ను ముంచెత్తిన వరదలు..
## 5 నెలల ముందే హెచ్చరించిన నివేదిక

- నేపాల్ వరదల్లో 272 మంది మృతి
- ఐదు నెలల ముందే హెచ్చరించిన ఐసీఐఎండీ నివేదిక
- హిమాలయాల్లో రెట్టింపైన వేగంతో కరుగుతున్న మంచు
- నివేదికలోని హెచ్చరికలే నిజమయ్యాయని శాస్త్రవేత్తల విశ్లేషణ

## చరిత్రలోనే అతిపెద్ద డ్యామ్ విపత్తు: ఒక్క రాత్రిలో



### 62 డ్యాములు బద్దలు.. 2.30 లక్షల మంది బలి!

- 1975లో చైనాలో బాంకియావో డ్యామ్ విపత్తు
- టైఫూన్ కారణంగా రికార్డుస్థాయిలో కురిసిన వర్షాలు
- ఒక్క రాత్రిలో 62 డ్యాములు ధ్వంసం
- దాదాపు 2.30 లక్షల మంది మృతి చెందినట్లు అంచనా
- 20 ఏళ్ల పాటు నిజాలు దాచిపెట్టిన చైనా ప్రభుత్వం

# అమృత్ 2.0 ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

- ఒంగోలు తాగునీటి కష్టాలకు చెక్.. రంగరాయుడు చెరువు వద్ద కొత్త ప్రాజెక్టు
- ఒంగోలు నగరానికి 24 గంటల తాగునీటి సరఫరాకు శ్రీకారం
- రూ.424.42 కోట్ల అంచనా వ్యయంతో పథకం అమలు
- 51 వేలకు పైగా ఇళ్లకు కొత్తగా కనెక్షన్లు.. 605 కి.మీ. పైప్‌లైన్



ప్రకాశం జిల్లా: ప్రకాశం జిల్లా ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. మిగతా 2 లో

# రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యం

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య



అమరావతి: ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి
- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా

# ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి.. 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

## జిల్లా సంస్కృతికి ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహం ఆవిష్కరణ

- మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమన్న లోకేశ్
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు
- వివిధ రంగాలకు చెందిన మహనీయుల విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు



అమరావతి: సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను మిగతా 2 లో



## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం.. మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

- అసెంబ్లీలో దీర్ఘకాల సంప్రదాయాన్ని పక్కనపెట్టిన సీఎం విజయ్
- తన కుర్చీ నుంచి లేచి మంత్రుల మధ్య కూర్చుని ఆశ్చర్యపరిచిన వైనం
- ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్న సభా వర్గాలు
- సభలో అధికారులు ఉండాలని డిమాండ్ చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు

- జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు మిగతా 2 లో

# వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

## సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత

- అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు
- ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక



హైదరాబాద్: కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో మిగతా 2 లో

# రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయి

- రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ
- రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల మిగతా 2 లో



## బీసీ, ఈబీసీ విద్యార్థులకు గుడ్‌న్యూస్.. విదేశీ చదువులకు తెలంగాణ సర్కార్ సాయం!

- బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్
- ఓవర్సీస్ విద్యానిధి కింద 350 మందికి అవకాశం
- బీసీ విద్యార్థులు 250 మంది, ఈబీసీలు 100 మంది
- సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు

### నేపాల్‌ను ముంచెత్తిన వరదలు..
## 5 నెలల ముందే హెచ్చరించిన నివేదిక

నేపాల్: నేపాల్‌ను ఇటీవల అతలాకుతలం చేస్తూ 272 మంది మృతికి కారణమైన ఆకస్మిక వరదలపై ఐదు నెలల ముందే ప్రమాద ఘంటికలు మోగాయి. ఖాట్మండు కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్' (×జ×మీణ) ఈ ఏడాది మార్చిలోనే హిందూకుష్ హిమాలయాల్లో హిమానీనదాలు ప్రమాదకర స్థాయిలో కరుగుతున్నాయని రెండు నివేదికల ద్వారా హెచ్చరించింది. ఐసీఐఎంఓడీ నివేదిక ప్రకారం, 2000వ సంవత్సరం నుంచి హిందూకుష్ హిమాలయాల్లో మంచు కరిగే వేగం రెట్టింపు అయింది. 1975 నుంచి ఇప్పటివరకు దాదాపు 27 మీటర్ల మందంపాటి మంచు పొర కరిగిపోయింది. 1990-2020 మధ్య కాలంలో ఈ ప్రాంతంలోని హిమానీనదాలు తమ మొత్తం విస్తీర్ణంలో 12 శాతం, మంచు నిల్వల్లో 9 శాతాన్ని కోల్పోయాయి. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని, ఈ ప్రక్రియను తిరిగి పూర్వస్థితికి మళ్లించడం సాధ్యం కాకపోవచ్చని కూడా ఆ నివేదిక స్పష్టం చేసింది. నేపాల్ వరదలకు గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుగుతున్నప్పటికీ, శాస్త్రవేత్తలు కొన్ని అంశాలను ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతంలో కేవలం మంచు కురిసే 4,000 మీటర్ల ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పుడు వర్షాలు కురవడం, వేగంగా మంచు కరగడం, ఎత్తైన శిఖరాల నుంచి మంచు-రాళ్ల చరియలు విరిగిపడి నదుల్లో కలవడం వల్లే ఈ ఆకస్మిక వరదలు సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల మంచు కరిగి, నేల మెత్తబడటం మూలంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం పెరుగుతోందని ఐసీఐఎంఓడీ నిపుణుడు మహ్మద్ ఫరూక్ అజమ్ పేర్కొన్నారు. ధ్రువ ప్రాంతాల తర్వాత ప్రపంచంలోనే అత్యధిక మంచు నిల్వలు హిమాలయాల్లోనే ఉన్నాయి. వీటిని "ఆసియా వాటర్ టవర్స్" అని పిలుస్తారు. ఇక్కడి నుంచి ప్రవహించే 10 ప్రధాన నదీ వ్యవస్థలపై సుమారు రెండు బిలియన్ల మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు.

## చరిత్రలోనే అతిపెద్ద డ్యామ్ విపత్తు: ఒక్క రాత్రిలో
### 62 డ్యాములు బద్దలు.. 2.30 లక్షల మంది బలి!

ఢిల్లీ: నేపాల్‌లో సంభవించిన తాజా వరదల నేపథ్యంలో, ప్రకృతి ప్రకోపానికి మానవ నిర్మిత కట్టడాలు చిక్కితే జరిగే విధ్వంసానికి చైనాలోని బాంకియావో డ్యామ్ ఉదంతమే ఒక ప్రబల నిదర్శనం. ప్రపంచ చరిత్రలోనే అత్యంత దారుణమైన డ్యామ్ వైఫల్యంగా ఇది మిగిలిపోయింది. ఈ ఘోర విపత్తులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,30,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 1975 ఆగస్టులో వచ్చిన 'నీనా' టైఫూన్ ప్రభావంతో చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో రికార్డు స్థాయి వర్షాలు కురిశాయి. కేవలం 24 గంటల వ్యవధిలోనే 1,000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో బాంకియావో డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆగస్టు 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత డ్యామ్ పైనుంచి నీరు పొంగిపొర్లి, కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అది కుప్పకూలిపోయింది. దీని ఫలితంగా సుమారు 701 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో జనావాసాలపై విరుచుకుపడింది. ఈ ఉద్ధృతికి సమీపంలోని సిమన్‌తాన్ డ్యామ్‌తో పాటు మొత్తం 62 ఆనకట్టలు ఒకదాని తర్వాత ఒకటి పేకమేడల్లా కూలిపోయాయి. ఈ జల ప్రళయానికి తక్షణమే సుమారు 26,000 మంది బలవ్వగా, ఆనంతరం ఏర్పడిన కరవు, అంటువ్యాధుల కారణంగా మొత్తం మృతుల సంఖ్య 2.30 లక్షలకు చేరిందని అంతర్జాతీయ నివేదికలు అంచనా వేశాయి. అయితే, చైనా ప్రభుత్వం ఈ మహా విషాదం తాలూకు వివరాలను దాదాపు రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి తెలియకుండా అత్యంత గోప్యంగా ఉంచింది. 1951-52 మధ్య కాలంలో నిర్మించిన ఈ డ్యామ్‌ను ఒకప్పుడు 'ఐరన్ డ్యామ్' అని పిలిచేవారు. కానీ నిర్మాణ లోపాలు, అధికారుల వైఫల్యాలు, సరైన సమయంలో హెచ్చరికలు జారీ చేయకపోవడం వంటివి ఈ ఘోర విషాదానికి ప్రధాన కారణాలని విశ్లేషణలు వెల్లడించాయి. ఈ ఘటన జరిగిన సుదీర్ఘ కాలం తర్వాత, పాత డ్యామ్ స్థానంలో 1993లో నూతన ఆనకట్టను నిర్మించారు.

### గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా
## బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

### తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం..
## మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది. సాధారణంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. కానీ, ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి.

### అధికారుల హాజరుపై ప్రతిపక్ష నేత డిమాండ్

ఇదిలా ఉంటే.. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్‌ను కోరారు. "గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరు' అని ఆయన ప్రస్తావించారు. దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న 'వార్ రూమ్' నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.

### బీసీ, ఈబీసీ విద్యార్థులకు గుడ్‌న్యూస్..
## విదేశీ చదువులకు తెలంగాణ సర్కార్ సాయం!

హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి' పథకం కింద దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ విడతలో 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనుంది. మొత్తం 350 మందిలో 250 మంది బీసీ విద్యార్థులు ఉంటారు. మరో 100 మంది ఈబీసీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. విదేశీ విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద, మధ్యతరగతి బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అర్హత ఉన్న విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### ఒంగోలు తాగునీటి కష్టాలకు చెక్..
## రంగరాయుడు చెరువు వద్ద కొత్త ప్రాజెక్టు

ప్రకాశం జిల్లా: ప్రకాశం జిల్లా ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. రంగరాయుడు చెరువు వద్ద రూ.424.42 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పథకానికి ఆయన నేడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను పునర్వ్యవస్థీకరిస్తారు. మొత్తం 605.30 కిలోమీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్మించి, 51,340 గృహాలకు నేరుగా సర్వీస్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీని ద్వారా నగరంలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందనుంది. పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత సమయాల్లో కాకుండా 24 గంటలూ నీటిని అందుబాటులో ఉంచడమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, విజయ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

### రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..
## రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

హైదరాబాద్: కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

### ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి..
## 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

అమరావతి: సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే వేదికపై ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు, వారి సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సాహిత్య రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం కనిపించేలా ప్రధాన కూడలిలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తిదాయక విగ్రహాలు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు.

ఒంగోలు గిత్త.. జిల్లాకే గర్వకారణం

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి పశువుల విశిష్టతను చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతికి అద్దం పట్టేలా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రకాశం జిల్లా పశుసంపదకు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీని ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించిన విగ్రహాల వివరాలు:

రాజకీయ, స్వాతంత్ర్య సమరయోధులు: రొండా నారపరెడ్డి (మాజీ మంత్రి, ఎంపీ), దర్శి చెంచయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు), మాదాల నారాయణ స్వామి (మాజీ ఎంపీ, ఎమ్మెల్యే) సామాజిక సేవకులు, విద్యావేత్తలు, అధికారులు: కత్తి చంద్రయ్య (ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్), వరదా శ్రీరాముల నాయుడు (ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు), బివియల్ నారాయణ ('పావలా డాక్టర్'), క్లౌ జాన్ ఎవరెట్ (సామాజిక సేవకులు), గోరంట్ల వెంకన్న (మహాదాత), శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రావిడ భాషాశాస్త్ర పితామహులు), బండారు రామారావు (నాటక సమాజ నిర్వాహకులు). కళా, సాహిత్య రంగ ప్రముఖులు: భానుమతి రామకృష్ణ (బహుముఖ ప్రజ్ఞాశాలి, నటి), గరికపాటి వరలక్ష్మి (నటి, గాయని), టి. కృష్ణ (విప్లవ దర్శకులు), షేక్ చినమౌలానా (నాదస్వర విద్వాంసులు), నీలంరాజు వెంకట శేషయ్య (పాత్రికేయులు, సాహితీవేత్త), ధారా రామనాథ శాస్త్రి (నాట్యావధాని), నాగభైరవ కోటేశ్వరరావు (కవి, రచయిత), కలేకూరి ప్రసాద్ (దళిత కవి, రచయిత), పైడి తెరేష్ బాబు (దళిత సాహితీవేత్త, కళాకారులు), మల్లవరపు జాన్ (కవి, రచయిత).

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్
### శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్



అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'రాడిసన్' 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రతిష్టాత్మక హోటల్ రూపుదిద్దుకోనుంది. ఒంగోలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న మొదటి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్ ఇదే కావడం విశేషం. 151 విలాసవంతమైన గదులు, మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్లు, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి అత్యాధునిక సదుపాయాలతో దీనిని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా, బిజినెస్ టూరిజం విస్తరణకు అనుగుణంగా 2,100 చదరపు మీటర్లకు పైగా విశాలమైన స్థలంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి-16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ వల్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విలాసవంతమైన 5 స్టార్ హోటల్ రాకతో ఒంగోలు, దాని పరిసర ప్రాంతాల్లో హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం లోకేశ్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

### 'లేక్ ఒంటారియో' పేరు మార్పు..
## 'లేక్ అమెరికా'గా ప్రకటించిన ట్రంప్

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ఉన్న గ్రేట్ లేక్స్‌లో ఒకటైన 'లేక్ ఒంటారియో' పేరును 'లేక్ అమెరికా'గా మారుస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ సరస్సు అత్యంత కీలకమని, దాని ప్రాధాన్యతను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 30 రోజుల్లోగా ఈ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా అంతర్గత వ్యవహారాల కార్యదర్శిని, భౌగోళిక నామకరణాల బోర్డును ఆదేశించారు. ఈ నిర్ణయానికి గల కారణాలను ట్రంప్ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా వివరించారు. "గ్రేట్ లేక్స్ పరిరక్షణలో అమెరికానే గొప్ప సంరక్షకుడిగా ఉంది. అమెరికా అందిస్తున్న భద్రత, పెడుతున్న పెట్టుబడులు లేకపోతే ఈ మంచినీటి వ్యవస్థ నౌకాయానానికి, వినోదానికి ఈ స్థాయిలో అందుబాటులో ఉండేది కాదు" అని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో గ్రేట్ లేక్స్ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ కోసం అమెరికా దాదాపు 4 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టిందని, కెనడా పెట్టుబడులు చాలా తక్కువని ఆయన అన్నారు. గ్రేట్ లేక్స్‌లో మంచును తొలగించే 11 నౌకల్లో 9 అమెరికా కోస్ట్ గార్డ్ నిర్వహిస్తున్నవేనని గుర్తుచేశారు. చారిత్రకంగా, వాణిజ్యపరంగా, రక్షణాపరంగా కూడా ఈ సరస్సు అమెరికాకు ఎంతో ముఖ్యమని ట్రంప్ తెలిపారు. న్యూయార్క్‌లోని ఓస్వెగో చారిత్రక కోటగా, సెయింట్ లారెన్స్ సీవే నుంచి అమెరికాలోకి వచ్చే మొదటి ఓడరేవుగా నిలిచిందని ప్రస్తావించారు. ఈ సరస్సు నీటిని తాగునీటి అవసరాలకు, విద్యుత్ ప్లాంట్లకు వినియోగిస్తున్నారని, లక్షలాది అమెరికన్ల ఉద్యోగాలకు ఈ ప్రాంతం ఆధారమని తెలిపారు. అయితే, ఈ పేరు మార్పు కేవలం అమెరికా ఫెడరల్ ప్రభుత్వ వినియోగానికి మాత్రమే వర్తిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వ పటాలు, పత్రాలు, ఒప్పందాలు, అధికారిక సమాచారంలో మాత్రమే 'లేక్ అమెరికా' అనే పేరును వాడతారు. కెనడా, అంటారియో ప్రావిన్స్, అంతర్జాతీయ సంస్థలు లేదా ప్రైవేట్ మ్యాప్ ప్రొవైడర్లు ఈ కొత్త పేరును ఉపయోగించాల్సిన అవసరం లేదు. ట్రంప్ ఒక భౌగోళిక ప్రాంతం పేరు మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025 జనవరిలో 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో' పేరును ఫెడరల్ అవసరాల కోసం 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ఆయన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

### 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'..
## బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

ఢిల్లీ: ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్-రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

### శ్రీవారి దర్శనానికి భారీ నిరీక్షణ..
## నిండిపోయిన క్యూ కాంప్లెక్స్‌లు

తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తడంతో తిరుమల కొండపై రద్దీ విపరీతంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ సిబ్బంది నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ఇక నిన్న (గురువారం) మొత్తం 66,437 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 26,771 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ.4.45 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

### 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..
## ఆతిథ్య బిడ్‌పై అమిత్ షా సమీక్ష

ఢిల్లీ: భారత్‌లో అంతర్జాతీయ క్రీడా సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా సన్నాహకాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ బిడ్డింగ్ ప్రక్రియ పురోగతిని, క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ఒలింపిక్స్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029లో జరగనున్న పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌ను కూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం అనంతరం అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను నిర్వహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా నిలబెట్టడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో క్రీడల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులు అమిత్ షాకు వివరించారు. ఇటీవల గ్లాస్గోలో 2026 కామన్వెల్త్ గేమ్స్ ముగిసిన తర్వాత, తదుపరి ఆతిథ్య నగరంగా అహ్మదాబాద్ తరఫున గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అందుకున్న విషయం విదితమే.

## సీఆర్‌డీఏ భేటీలో పలు ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులు

అమరావతి: అమరావతి అభివృద్ధికి సంబంధించి పలు కీలక ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన సీఆర్‌డీఏ 65వ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశం అనంతరం పురపాలక శాఖ మంత్రి నారాయణ మీడియాకు వివరాలను వెల్లడించారు.

### ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇవి:

అమరావతిలో అత్యాధునిక లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి రూ. 596 కోట్లు కేటాయింపు. కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల కోసం రూ. 1,430 కోట్లు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల లేఅవుట్‌లలో బీటీ (తారు) రోడ్ల అభివృద్ధి. అమరావతి నుంచి మంగళగిరికి తాగునీటి సరఫరా ప్రాజెక్టు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐఓసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి సంబంధించిన అనుమతులు. వీటితో పాటు భూ సమీకరణలో భాగంగా రెండో దశలో భూములిచ్చిన రైతులకు కూడా రుణమాఫీ ప్రయోజనాన్ని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. 2026 జనవరి 6వ తేదీ లేదా అంతకంటే ముందు రుణాలు తీసుకున్న రైతులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కిలో ఉల్లి రూ.35కే.. దేశంలో కొరత లేదన్న కేంద్రం

ఢిల్లీ: దేశంలో ఉల్లిపాయల కొరత ఏమాత్రం లేదని, వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి నుంచి కిలో ఉల్లిని రూ. 35కే విక్రయిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులను కాపాడే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేసింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే ఢిల్లీలోని కృషి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. తొలుత నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్‌ల ఔట్‌లెట్లు, మొబైల్ వ్యాన్ల ద్వారా ఈ విక్రయాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిధి ఖరే మీడియాతో మాట్లాడుతూ, "దేశంలో ఉల్లి ఉత్పత్తికి గానీ, లభ్యతకు గానీ ఎలాంటి కొరత లేదు. వినియోగదారులను ఆకస్మిక ధరల పెరుగుదల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉల్లి ఎగుమతులు కూడా దాదాపు అదే స్థాయిలో ఉన్నాయి" అని వివరించారు. నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ అగర్వాల్ మాట్లాడుతూ, ఢిల్లీ వ్యాప్తంగా 40 ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా ఉల్లి అమ్మకాలు ప్రారంభించినట్లు ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్, రిటైల్ చైన్‌ల ద్వారా కూడా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దుకాణాల ద్వారా కూడా రూ. 35కే ఉల్లిని అందుబాటులోకి తెచ్చేందుకు ఢిల్లీ ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీసీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనీస్ జోసెఫ్ చంద్ర మాట్లాడుతూ, కార్యక్రమం ప్రారంభమైన వెంటనే తమ రిటైల్ కేంద్రాల్లో ఉల్లి అమ్మకాలు మొదలుపెట్టామని చెప్పారు. ముఖ్యంగా మెట్రో స్టేషన్ల సమీపంలోని ఎన్‌సీసీఎఫ్ ఔట్‌లెట్లలో వినియోగదారులు రూ. 35కే ఉల్లిని కొనుగోలు చేయవచ్చని ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా ఈ నెట్‌వర్క్‌ను విస్తరిస్తామని హామీ ఇచ్చారు.

# పుట్టపర్తిలో ప్రతిష్టాత్మకంగా 16వ జాతీయ వినియోగదారుల సదస్సు

ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆహ్వానం



పుట్టపర్తి మహి న్యూస్ ఆగష్టు 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహార మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. సురేష్ కుమార్ ఆహ్వానించారు. గురువారం అమరావతి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్లపాటి శ్రీనివాసరావు, మహమ్మద్ బాజీతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి సదస్సుకు అధికారికంగా ఆహ్వానం అందజేశారు. అనంతరం పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, పౌరసరఫరాల శాఖ సంచాలకులు నూపుర్ అజయ్ కుమార్‌లను కూడా జాతీయ వినియోగదారుల సదస్సుకు ఆహ్వానించినట్లు సురేష్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం

జాతీయ వినియోగదారుల సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చినట్లు సురేష్ కుమార్ తెలిపారు.

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో సదస్సు

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో రెండు రోజుల పాటు 16వ జాతీయ వినియోగదారుల సదస్సును భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు సురేష్ కుమార్ తెలిపారు. దేశం నలుమూలల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో రాష్ట్ర స్థాయి అధికారులు, జాతీయ స్థాయి వినియోగదారుల సమన్వయ మండలి ప్రతినిధులు, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు, వివిధ జిల్లాల వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొననున్నారు. వినియోగదారుల హక్కులు, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల రక్షణ చట్టాల అమలు తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. వినియోగదారుల సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
# అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం/కోటబొమ్మాళి, మహి న్యూస్, ఆగస్టు 28: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎరువుల లభ్యతపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 1,65,583 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 1,51,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయని మంత్రి తెలిపారు. ఖరీఫ్ పంటలకు జిల్లాకు మొత్తం 37,707 టన్నుల యూరియా, 22,322 టన్నుల డీఏపీ అవసరమని, ఇప్పటివరకు 27,147 టన్నుల యూరియా, 10,815 టన్నుల డీఏపీ జిల్లాకు చేరిందని వివరించారు. ఇందులో 12,158 టన్నుల యూరియా, 5,277 టన్నుల డీఏపీని రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా ఏపీ ఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకుని పారదర్శకంగా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 11,132 టన్నుల యూరియా, 3,766 టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.



అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

రైతులకు ఎరువుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఎరువులను నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించే ప్రైవేట్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి అందిన సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించామని, నిబంధనలు ఉల్లంఘించి ఎరువులను అధిక ధరలకు విక్రయించిన 16 మంది ప్రైవేట్ డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. మరో 62 మంది డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఎవరైనా ఎరువుల విషయంలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# పీ4 చరిత్రలో నిలిచిపోయే విప్లవాత్మక కార్యక్రమం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 28: అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఉద్దేశించిన 'పీ4' కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని, ఇది పేదల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షకు శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో లక్ష మందికి పైగా లబ్ధిదారులను గుర్తించగా, ఇప్పటికే 51 వేల మందిని మార్గదర్శకులకు అనుసంధానం చేసి వారి ఉపాధికి పూర్తి తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా విజన్ యాక్షన్ ప్లాన్ అమలులో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి, దాని ద్వారా పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం చేస్తామని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కారు చొరవతో దశాబ్దాల నాటి నేరడి బ్యారేజీ ప్రాజెక్టు సమస్యకు పరిష్కారం లభించి, కార్యరూపం దాల్చడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ క్రమంగా పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. ఇక నేపాల్‌లో అనూహ్యంగా వచ్చిన వరదలపై స్పందిస్తూ, అక్కడి పరిస్థితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, నేపాల్ ఎంబసీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. రోడ్లు, నెట్‌వర్క్ వ్యవస్థ పునరుద్ధరణ కాగానే సహాయక చర్యలు మరింత వేగవంతం చేసి, బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండ్యా, సీపీవో ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్షకు జిల్లాలో 4 కేంద్రాలు

ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 28 : ఈ నెల 30న ఆదివారం జరగనున్న నీట్ పీజీ-2026 పరీక్షలకు శ్రీకాకుళం జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గతంలో కేటాయించిన మూడు కేంద్రాలతో పాటు కొత్తగా టెక్కలిలోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌ను కూడా పరీక్షా కేంద్రంగా చేర్చడంతో జిల్లాలో మొత్తం కేంద్రాల సంఖ్య 4కు చేరిందని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎచ్చెర్ల మండలంలోని శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చిలకపాలెం జంక్షన్, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ప్రక్కన, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ మారుతీ నగర్-2 తో పాటు కొత్తగా టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రాల పర్యవేక్షణకు శ్రీకాకుళం ఆర్డీవోతో పాటు టెక్కలి ఆర్డీవోను సూపర్‌వైజరీ అధికారిగా, టెక్కలి ఆర్ఎస్‌డీటీ ని నోడల్ అధికారిగా నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతతో పాటు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షలకు పంపుతారని, అభ్యర్థుల ఈ విషయంలో సహకరించాలని కోరారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడుపుతామని, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బందితో కూడిన ప్రథమ చికిత్స అంబులెన్స్ సదుపాయాలు కల్పించామని చెప్పారు.

## కరజాడలో అక్రమ ఇసుక తవ్వకాలు.. రెండు లారీలు సీజ్



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 28: మండల పరిధిలోని కరజాడ గ్రామంలో శుక్రవారం అక్రమంగా సాగుతున్న ఇసుక తవ్వకాలు, తరలింపుపై రెవెన్యూ, పోలీస్, గనుల శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో శ్రీకాకుళం తహసీల్దార్ శిర్ల గణపతి, ఎస్సై కేవీ సురేష్, మైనింగ్ ఏడీ మాణిక్యాలరావు తమ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సమయంలో అక్రమంగా ఇసుక లోడుతో వెళ్తున్న రెండు లారీలను అధికారులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకుని, సీజ్ చేశారు. అనంతరం వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించేది లేదని, ప్రకృతి వనరుల దోపిడీకి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, రవాణా చేస్తే భారీ జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఒంగోలు నగరానికి 24X7 తాగునీటి
# సరఫరా దిశగా కీలక అడుగు

నగర ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఒంగోలు, మహి న్యూస్, ఆగస్టు 28: ప్రకాశం జిల్లా ఒంగోలు నియోజక వర్గంలోని రంగరాయుడు చెరువులో అమృత్ 2.0 త్రాగునీటి ప్రాజెక్టుకు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఒంగోలు నగర ప్రజలకు 24x7 తాగునీటి సరఫరా అందించే దిశగా రూ.424.42 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. మేఘా ఇంజనీరింగ్ సంస్థ రెండేళ్లలో ఈ పనులను పూర్తి చేయనున్నది. ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని మొత్తం 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను రీ-జోనింగ్ చేసి, 605.30 కిలోమీటర్ల పొడవున తాగునీటి పంపిణీ నెట్‌వర్క్ అభివృద్ధి లక్ష్యం. దీనిద్వారా 51,340 హౌస్ సర్వీస్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన తాగునీటి సరఫరా అందనుంది. నగరంలో నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించి, ప్రజలకు నిర్ణీత సమయాల్లో మాత్రమే కాకుండా 24 గంటలూ తాగునీరు అందుబాటులో ఉండేలా చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. రోజుకు 85 మిలియన్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తారు. పెరుగుతున్న ఒంగోలు నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన, స్థిరమైన నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, విజయ్ కుమార్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌కు రాఖీ కట్టిన మంత్రి సవిత, ఎమ్మెల్యే గల్లా మాధవి

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉండవల్లి నివాసంలో వేడుకలు





ఉండవల్లి మహి న్యూస్ ఆగష్టు 28: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉండవల్లిలోని నివాసంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలుగింటి ఆడపడుచులకు మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష..
# ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

సెప్టెంబర్ 3న వార్డుల వారీ ఓటర్ల జాబితా ప్రచురణకు ఆదేశాలు



జంగారెడ్డిగూడెం మహి న్యూస్ ఆగష్టు 28: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ప్రాంతీయ మున్సిపల్ పరిపాలన సంచాలకులు రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రాంతీయ సంచాలకులు.. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 3, 2026న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, జాబితాలను ముద్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రచురణకు రెండు రోజుల ముందుగానే ఓటర్ల జాబితాలను ముద్రించి సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



29 నుంచి 32కు వార్డుల పెంపు

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో గతంలో 29 వార్డులు ఉండగా, కొత్తగా 32 వార్డులుగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 48,463 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ మేనేజర్, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహి న్యూస్ శైలిలో, ఆకర్షణీయమైన శీర్షికతో ఇలా:

మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రాఖీలు కట్టిన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, తెలుగుమహిళలు, బ్రహ్మకుమారీలు




అనంతపురం మహి న్యూస్ ఆగష్టు 28: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దళవాయి రమాదేవితో పాటు తెలుగుమహిళలు, బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక అని అన్నారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మగౌరవం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముందస్తు కార్యాచరణతో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవాలి..!!

ప్రత్యామ్నాయ చర్యల సన్నద్ధతపై జేసీ డా. నిధిమీనా



కడప, మహి న్యూస్ ఆగస్టు 28: తాగునీరు, శాశ్వత ఉద్యాన పంటల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని జేసీ డా. నిధిమీనా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుండి.. "జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, సాగు, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర అంశాలపై" జేసీ డా. నిధిమీనా సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జూన్ 1 నుంచి ఆగస్టు 26 వరకు సాధారణ వర్షపాతం 263.7 మి.మీ.కు గాను 132.7 మి.మీ. మాత్రమే నమోదై 49.7 శాతం లోటు ఉందని అధికారులు వివరించారు. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటివరకు 35.4 శాతం మాత్రమే సాగు జరిగిన నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని జేసీ సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు 44.9 శాతానికి పడిపోయిన నేపథ్యంలో తాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శాశ్వత ఉద్యాన పంటలు, అత్యవసర పారిశ్రామిక అవసరాలు, చివరగా సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. మైలవరం జలాశయంలో తాగునీటి అవసరానికి కేటాయించాల్సిన నీటి కంటే నిల్వ తక్కువగా ఉన్నందున పరిస్థితిని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. శ్రీశైలం నుంచి జిల్లాలోని జలాశయాలను సాధ్యమైనంత మేరకు నింపేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో పాటు, మైలవరం, పైడిపాలెం, సీబీఆర్, వామికొండ సాగర్, సర్వరాయసాగర్ తదితర జలాశయాల్లో నీటి నిల్వలను పెంచే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కాలువల్లో నీటి వృథా, అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పరిస్థితిపై మండలాల వారీగా వివరాలు సేకరించి, విఫలమైన తాగునీటి వనరులను పునరుద్ధరించడం, పైపులైన్ పథకాలను పూర్తి చేయడం, మరమ్మతు అవసరమైన బోర్లు, చేతిపంపులను త్వరితగతిన బాగుచేయాలని ఆదేశించారు. అవసరం లేకుండా కొత్త లోతైన బోర్లకు అనుమతులు ఇవ్వకుండా, భూగర్భ జలశాఖ సాంకేతికంగా సాధ్యమని నిర్ధారించిన చోట మాత్రమే అనుమతించాలని సూచించారు. ఖరీఫ్‌లో తాజా వరి సాగుకు కాలువలు తెరవకుండా రైతులకు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, మినుములు, అలసందలు, పశుగ్రాస పంటల వైపు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. ఉద్యాన పంటల విషయంలో.. ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్న మామిడి తోటలకు ముందుగా సూక్ష్మ సేద్య పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూక్ష్మ సేద్యంలో పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా పరిష్కరించి, అధిక ప్రమాద ప్రాంతాల్లో పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో పశుగ్రాస లోటును దృష్టిలో ఉంచుకుని చెరువులు, జలాశయాల్లో నీరు తగ్గిన ప్రాంతాలను స్వల్పకాలిక పశుగ్రాస సాగుకు వినియోగించుకోవాలని, సామూహిక పశుగ్రాస క్షేత్రాలను పెంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులపై మండలాల వారీగా వివరాలను సేకరించి, కరువు పరిస్థితుల నిర్ధారణకు అవసరమైన వర్షపాతం, పంటలు, భూగర్భ జలాలు, ఉపగ్రహ ఆధారిత సూచికలు తదితర సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేయాలని సూచించారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి, అవసరమైన నివేదికలను గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో.. సీపీవో హజరతయ్య, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు ఛానల్ పూర్తి చేసే బాధ్యత నాదే

పర్చూరు వరకు పొడిగింపుపై రాజీ లేదు

28 వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

బాపట్ల జిల్లా పర్చూరు ఆగస్టు 28 : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఏడు దశాబ్దాల కలను సహకారం చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.ఛానల్ విస్తరణతో నియోజకవర్గంలోని సుమారు 28 వేల ఎకరాలకు సాగునీటితో పాటు ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు తీసుకురావడం ద్వారా రైతులకు శాశ్వతంగా నీటి భరోసా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులు అపోహలకు గురికావద్దని ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు.

# మార్టూరు చెరువులను సుందరంగా తీర్చిదిద్దాలి

వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించాలి

సాగర్ జలాలతో రెండు చెరువులను నింపాలి..

నీటి కొరత లేకుండా చర్యలు..డీఎంఎఫ్ నిధులతో ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టాలి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



బాపట్ల జిల్లా ఆగస్టు 28 : మార్టూరు పట్టణంలోని చెరువులను సాగర్ జలాలతో నింపి నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మార్టూరులోని చెరువులను ఆయన పరిశీలించారు. చెరువుల పరిస్థితి, నీటి లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు చెరువులను సాగర్ జలాలతో నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. చెరువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.మార్టూరు ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి అధికారులకు స్పష్టం చేశారు. డీఎంఎఫ్ నిధులతో ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మహి న్యూస్
తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్

శనివారం - 29 - ఆగష్టు - 2026

# తిరుపతిలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణ-- డిజిటల్ వెల్‌నెస్ పై రెండు రోజుల అవగాహన కార్యక్రమం

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ, ఆధ్వర్యంలో ప్రకృతి వైద్యం ద్వారా ముందస్తు ఆరోగ్య సంరక్షణ మరియు డిజిటల్ వెల్‌నెస్ అంశంపై రెండు రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆగష్టు 29 మరియు 30 తేదీలలో తిరుపతిలోని మహతి ఆడిటోరియం నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆగష్టు 29న విద్యార్థులకు, ఆగష్టు 30న ఉద్యోగులు, ప్రకృతి వైద్యాన్ని అనుసరించే వారికి ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమన్ని 29న ఉదయం 9.45 గంటలకు ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా. మంతెన సత్యనారాయణ రాజు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి ముందస్తు ఆరోగ్య సంరక్షణ, ప్రకృతి వైద్య విధానాలు, జీవనశైలి మార్పుల ద్వారా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తారని అన్నారు. అలాగే 11.30 గంటలకు డిజిటల్ వెల్‌నెస్ కోచ్ బాలా కిషోర్ డిజిటల్ యుగంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలు, డిజిటల్ వినియోగంలో జాగ్రత్తలు, డిజిటల్ డీటాక్స్ అవసరంపై ప్రసంగిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆహారమే ఔషధం - వంటగదే వైద్యశాల అనే అంశం పై డా. మంతెన సత్యనారాయణ రాజు ప్రసంగం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలు బాలా కిషోర్ ఆధ్వర్యంలో డిజిటల్ డీటాక్స్ సెషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉద్యోగులు, ప్రకృతి వైద్యం అనుచరులు, ఆరోగ్యంపై ఆసక్తి ఉన్న ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో కోరారు.

# డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు పై భారీ ర్యాలీ

## అమరావతి ఛాంపియన్‌షిప్ -- గ్రామీణ ప్రతిభకు రాష్ట్రస్థాయి వేదిక

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 28: క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు మరియు ప్రభుత్వ విద్యా సంస్థల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం డ్రగ్స్ వద్దు బ్రో . . డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు నినాదంతో స్థానిక తారకరామా స్టేడియం నుండి ఎన్ టి ఆర్ విగ్రహం వరకు నిర్వహించిన భారీ ర్యాలీ ని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించగా, శాప్ ఎండీ భరణి, అడిషనల్ ఎస్పి లు, హాకీ క్రీడాకారిణి రజనీ, భారీ సంఖ్యలో అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడాకారులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో పై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా 12 క్రీడా విభాగాల్లో అండర్--17, అండర్--23 వయో విభాగాలకు చెందిన క్రీడాకారుల కోసం నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తిరుపతికి తీసుకువచ్చి పోటీలు నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 15 వేల మంది క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారున్నారు.

పోటీలలో పాల్గొన్న వారికి మెరుగైన బస, భోజన వసతులు కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగం శాప్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని పోటీలను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు, గాయాలు చోటుచేసుకోకుండా క్రీడాకారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న వారిలో సుమారు 65 శాతం మంది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కాగా, 80 శాతానికి పైగా క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను గుర్తించి వారికి తదుపరి స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ ఒక అరుదైన వేదికగా నిలిచిందన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.

యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా అండర్--17, అండర్--23 వయసు క్రీడాకారులు తమ తోటి విద్యార్థులు, యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసు శాఖ, శాప్ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి 'డ్రగ్స్ వద్దోయ్ బ్రో', 'డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు', 'డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' అనే నినాదాలతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాల పై కఠినంగా కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ మూడు మార్గాల్లో సమగ్రంగా చర్యలు చేపడుతూ తిరుపతి జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న తిరుపతిలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. తిరుపతి వేదికగా ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలను రానున్న సంవత్సరాల్లో మరింత పెద్ద ఎత్తున నిర్వహించేలా శాప్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్‌లో నాలుగు రోజుల పాటు ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు కేవలం పోటీలతోనే కాకుండా సామాజిక బాధ్యతతో కూడిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌కు ప్రతీకలుగా యువతకు ఆదర్శంగా నిలుస్తూ, సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో క్రీడాకారులు తమ మద్దతు అందించారన్నారు. 'డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు', 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్ పి మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వినియోగం, విక్రయం లేదా సంబంధిత సమాచారం ఉంటే వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా మొబైల్ యూనిట్‌ను ఏర్పాటు చేసి విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 12 వేల మందికి గంజాయి ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, 445 మందిని పాజిటివ్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. పాజిటివ్‌గా గుర్తించిన వారికి కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా అవసరాన్ని బట్టి కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# ఆగస్టు 30 న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాకు రాక!

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై జిల్లా ఎస్పితో కలసి ఏఎస్ఎల్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి, ఆగస్టు 28 (మహి న్యూస్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 30న తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు, భద్రతా చర్యల పై శుక్రవారం జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలసి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆగస్టు 30 న శ్రీకాళహస్తి సిసిఎన్ కన్వెన్షన్ హాల్ నందు జరగనున్న వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారని, ఈ పర్యటనలో భాగంగా శ్రీకాళహస్తిలోని ఎంజిఎం హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారని, అక్కడి నుండి సిసిఎన్ కన్వెన్షన్ హాల్ వరకు భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్య ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విఐపి, వివిఐపి, అతిథుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించి, ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. అడ్వాన్స్ అంబులెన్స్‌లు, జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎటువంటి భద్రతా లోపాలకు తావులేకుండా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా హెలిప్యాడ్ ల్యాండింగ్, టేకాఫ్ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు డాగ్ స్క్వాడ్‌లతో ఏరియా డామినేషన్, రాత్రి వేళల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాల్లో పటిష్టమైన రూట్ బందోబస్తు ఏర్పాటు చేసి, అవసరమైన చెకింగ్, క్లియరెన్స్ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. రూట్ బందోబస్తు, ఇతర భద్రతా ఏర్పాట్లను డిఎస్పీలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్షలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి, అడిషనల్ ఎస్ పి లు రామకృష్ణ, శ్రీనివాస రావు, డి ఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి మురళి మోహన్, తొట్టంబేడు తహశీల్దార్ భారతి, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు మరియు భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి విపిఆర్‌పి కీలకం

## చిత్తూరు జిల్లా పీడీ శ్రీదేవి



చిత్తూరు, ఆగస్టు 28 (మహి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల అవసరాలను గుర్తించి, వారి జీవనోపాధి మరియు ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచేందుకు విలేజ్ ప్రాస్పరిటీ అండ్ రెసిలియన్స్ ప్లాన్ (విపిఆర్‌పి) ఎంతో కీలకమని చిత్తూరు జిల్లా పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా స్థాయి టిఓటి శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె, విపిఆర్‌పిపై శిక్షణార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలు, సమస్యలు, అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటి ఆధారంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పేద కుటుంబాలు, జీవనోపాధి అవకాశాలు అవసరమైన కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు, జీవనోపాధి అవకాశాలు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. విపిఆర్‌పి ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, కుటుంబ అభివృద్ధి నుంచి గ్రామ సమగ్ర అభివృద్ధి వరకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలను రూపొందించి, వాటి అమలును సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు. శిక్షణ పొందిన టిఓటిలు మండల, గ్రామ స్థాయిలో సిబ్బంది మరియు సంబంధిత వర్గాలకు విపిఆర్‌పిపై సమగ్ర అవగాహన కల్పించి, ప్రణాళికల రూపకల్పనలో మార్గనిర్దేశం చేయాలని పీడీ శ్రీదేవి సూచించారు. "ప్రజల అవసరాలను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ వనరులను సమర్థవంతంగా అనుసంధానం చేయడం ద్వారా ప్రతి గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందిన, ఆర్థికంగా బలోపేతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే విపిఆర్‌పి ప్రధాన లక్ష్యం" అని ఆమె పేర్కొన్నారు.

# ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు ... జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్ట్ 28: సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి వైకల్యం అడ్డు కాదని పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో 59 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, చుడా ఛైర్మన్ కటారి హేమలత, మున్సిపల్ డిప్యూటీ మేయర్ రాజేష్, వికలాంగుల ఛైర్మన్ నారాయణస్వామి, అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులు ఎవరికి తక్కువ కాదని వీరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత నైపుణ్యం ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల్లో ఎంతోమంది నైపుణ్యం గల వారు ఉన్నారని వీరిని ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో లక్ష్యాలను సాధించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్లు, వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్స్ వంటి పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దివ్యాంగులకు(ఏపీ) నెలకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం, వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా కొత్త పథకాన్ని ప్రకటించింది. జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు 59 మంది దివ్యాంగులకు ఒక్కొక్కటి సుమారు రూ.1.20 లక్షల విలువైన 59 ద్విచక్ర వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. పూర్తిగా పారదర్శకమైన విధానంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి, దివ్యాంగుల సర్టిఫికెట్లతో పాటు సదరం సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాం.

అదేవిధంగా సుమారు మూడు నెలల క్రితం జిల్లాలో అలింకో క్యాంపును నిర్వహించగా, దాదాపు 5,300 మంది దివ్యాంగులను గుర్తించడం జరిగింది. వారికి సుమారు రూ.6 కోట్ల విలువైన వివిధ రకాల సహాయ పరికరాలను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇప్పటివరకు జిల్లాలో వివిధ సబ్సిడీ కార్యక్రమాల ద్వారా దివ్యాంగులకు సుమారు రూ.15 కోట్ల విలువైన పరికరాలు, స్కూటీలు, ట్రైసైకిళ్లు, సైకిళ్లు తదితరాలను అందించడం జరిగింది. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ, జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికి అవసరమైన సహాయం అందేలా శాచ్యురేషన్ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. చిత్తూరు ఎం ఎల్ ఏ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉందనడానికి ఈరోజు నిర్వహించిన వాహనాల పంపిణీ కార్యక్రమం ఒక నిదర్శనం. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వం మరియు దివ్యాంగుల మధ్య ఉన్న ఆత్మీయ బంధాన్ని చాటుతూ సుమారు 60 మంది దివ్యాంగులకు స్కూటర్లు, ట్రైసైకిళ్లు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇందుకు ముఖ్యమంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా చిత్తూరు నియోజకవర్గంలోని తెలుగు మహిళలకు, కూటమి ప్రభుత్వంలోని మహిళా నాయకురాళ్లందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. దివ్యాంగులకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందనడానికి ఇప్పటివరకు చేపట్టిన అనేక కార్యక్రమాలు నిదర్శనం. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పీవీకేఎన్ గ్రౌండ్స్‌లో సుమారు 4,000 మంది దివ్యాంగులకు వారికి అవసరమైన వివిధ రకాల సహాయ పరికరాలను అందించడం జరిగింది. చెవిటి వారికి వినికిడి పరికరాలు, కాళ్లు లేనివారికి కృత్రిమ కాళ్లు, నడకకు అవసరమైన స్టిక్స్, ఇతర సహాయక పరికరాలను వారి అవసరాలను పరిశీలించి అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వం మరియు దివ్యాంగుల మధ్య ఉన్న ఈ మంచి బంధాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తూ వారికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయి.

## స్వర్ణాంధ్ర విజన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో

# నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు పాత్ర కీలకం




తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 28 : స్వర్ణాంధ్ర విజన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు కీలకమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని 1వ బ్లాక్‌లో గల ముఖ్యమంత్రి సమావేశ మందిరం నుండి రాష్ట్రంలోని జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్లు మరియు ఇతర అధికారులతో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటు ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా నియోజకవర్గాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు, పీ4, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కెపిఐలు), పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పిపిపి) పురోగతిని వర్చువల్ గా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హాజరు కాగా, జిల్లా కలెక్టరేట్ నుండి జే సి ఆర్. గోవింద రావు, డిఆర్ఓ జి. నరసింహులు, సిపిఓ, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గత ఒక సంవత్సర కాలంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి మరియు విజయాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరియు నియోజకవర్గ విజన్ యూనిట్ల సభ్యులతో పరస్పరం చర్చించి, వివిధ నియోజకవర్గ విజన్ యూనిట్లు అమలు చేసిన ఉత్తమ విధానాలు మరియు వినూత్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాల సాధనకు ఎమ్మెల్యేలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాబోవు రోజులలో ప్రతి మూడు మాసములకు ఒక్కసారి సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గాల అభివృద్ధిలో మరింత మెరుగైన పనితీరును కనబరచాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, నాలెడ్జ్ పార్ట్నర్ లు, యంగ్ ప్రొఫెషనల్స్ మరియు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి నియోజకవర్గం అభివృద్ధి మరియు పనితీరులో ముందంజలో నిలిచే విధంగా పోటీతత్వ స్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

# ఓటర్ల సవరణ దరఖాస్తులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ ఆదేశం!

బాపట్ల జిల్లా ఆగస్టు 28 : సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయ్యారికి సంబంధించి హియరింగ్ పెండింగ్ లేకుండా పది రోజులలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం రాత్రి సర్, సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయ్యారికి సంబంధించి ఆర్డీఓ లు,మున్సిపల్ కమిషనర్లు, ఈ ఆర్ ఓ లు,ఏ ఈ ఆర్ ఓ లు,బి యల్ ఓ లతో జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వి సి హాల్ నుండి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయ్యారికి సంబంధించి హియరింగ్ పది రోజులలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 48 మంది ఈఆర్ఓ, ఏఈఆర్వోలు ఉన్నారని, వారి లాగిన్ లో ఉన్నటువంటి దరఖాస్తులను పూర్తి చేయుటకు రెండు విభాగాల ద్వారా ( ఉదయం మరియు రాత్రి ) ఇద్దరిద్దరు ఉద్యోగులకు విధులు కేటాయిన్నూ,వారికి శిక్షణ ఇచ్చి లాగిన్ లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 159116 మందికి నోటీసులు పంపడం జరిగిందని తెలిపారు. నోటీసుల జారీ, హియరింగ్ లకు సంబంధించి ఏ ఈ ఆర్ ఓ, బి ఎల్ ఓ వారీగా పెండింగ్ లేకుండా చూడాలని, పెండింగ్ గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ ఈ ఆర్ ఓ లు ప్రతి రోజు 250 హియరింగ్ పూర్తి చేయాలని, బి యల్ ఓ లాగిన్ నుండి వచ్చిన వెంటనే ఏ ఈ ఆర్ ఓ లు క్లియర్ చేయాలని ఏ ఈ ఆర్ ఓ లను ఆదేశించారు. 24 గంటలలో తక్కువ చేసిన పి వి పాలెం మండలంలో తక్కువ చేయడానికి కారణాలు ఏమిటని కలెక్టర్ తెలుసుకున్నారు. సంక్షిప్త ఓటర్ల సవరణ లో ఏమైనా సందేహాలు సమస్యలు ఉంటే వాటిని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వి సి హాల్ నుంచి డి పి ఓ.యల్.ప్రభాకర్ రావు, కోఆర్డినేషన్ సెక్షన్ పర్యవేక్షకులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# చెరువు కట్ట కలప మాయంపై పోలీసులకు ఫిర్యాదు



ఓజిలి, ఆగస్టు 28, మహి న్యూస్: తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, నగుటూరు గ్రామపంచాయతీ పరిధిలోని నగుటూరు పెద్ద చెరువు కట్టపై ఉన్న విలువైన కంపకర్ర మరియు కలప మాయమైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నేషనల్ వైస్ ఛైర్మన్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ అన్నవరం మస్తానయ్య, నేషనల్ వైస్ విమెన్ ప్రెసిడెంట్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ మద్దు శ్యామలమ్మ, తిరుపతి జిల్లా అధ్యక్షులు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ నారమల్లి రవికుమార్ సంయుక్తంగా శుక్రవారం రాత్రి ఓజిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓజిలి ఎస్సై శ్రీకాంత్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ, నగుటూరు పెద్ద చెరువు కట్టపై గతంలో పెద్ద ఎత్తున విలువైన చెట్లు, కంపకర్ర, కలప ఉండేదని, ప్రస్తుతం వాటిలో గణనీయమైన పరిమాణంలో కలప కనిపించకుండా పోయిందనే అనుమానాలు ఉన్నాయని తెలిపారు. చెరువు కట్టపై ఉన్న కలపకు సంబంధించి ముందుగా పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, చెట్ల సంఖ్య, జాతి, కొలతలు, పరిమాణం, మార్కెట్ విలువ తదితర వివరాలను నిర్ధారించాల్సి ఉండగా, ఆ ప్రక్రియ పూర్తికాకముందే ఇరిగేషన్ శాఖ ద్వారా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. దీంతో చెరువు కట్టపై అసలు ఎంత కలప ఉండేది, ఎంత కలప అధికారికంగా తొలగించబడింది, ఎంత కలప అక్రమంగా తరలించబడింది, ఆ కలపను ఎవరు తీసుకెళ్లారు, ఏ వాహనాలలో తరలించారు, ఎక్కడికి తరలించారు, ఎవరి వద్దకు చేరింది, విక్రయిస్తే వచ్చిన డబ్బు ఎవరికి చేరింది, అసలు వేలం ప్రక్రియ జరిగిందా లేదా అనే ప్రశ్నలకు సంబంధిత శాఖలు స్పష్టమైన సమాధానం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తికి సంబంధించిన విలువైన కలప మాయమైనట్లు తీవ్రమైన అనుమానాలు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత శాఖలు పోలీసులకు ఫిర్యాదు చేశాయా లేదా, కలప నిల్వలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన రికార్డులు ఉన్నాయా లేదా అనే విషయాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరారు. ఈ ఘటన కేవలం అధికారుల నిర్లక్ష్యం మాత్రమే కాకుండా, పరిస్థితులను బట్టి ప్రజా ఆస్తి దుర్వినియోగం, కలప అక్రమ తొలగింపు, దొంగతనం, అక్రమ రవాణా, అక్రమ విక్రయం లేదా నేరపూరిత కుమ్మక్కు వంటి అంశాలు కూడా ఉండే అవకాశం ఉందని ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ వెంటనే కేసు నమోదు చేసి, సంబంధిత శాఖల రికార్డులను పరిశీలించి, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలికితీయాలని కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## నేర నియంత్రణ.. ప్రజల భద్రతే లక్ష్యం

### రాత్రి వేళల్లో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

### అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా

### కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



కర్నూలు, ఆగస్టు 28 (మహి న్యూస్): ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కర్నూలు జిల్లాలో రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని పోలీసులు విస్తృతంగా కొనసాగిస్తున్నారు. కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వివరాలను పరిశీలించడంతో పాటు వారి వేలిముద్రలను సేకరిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతోంది. కర్నూలు నగరంలో కర్నూలు తాలూకా సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్ బృందాలు, క్యూఆర్‌టీ పోలీసు బృందాలు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు



నడిపే వారిని గుర్తించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. వాహనదారులు రాత్రి ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని, నిద్రమత్తు లేదా అలసటగా అనిపిస్తే వాహనాన్ని ఆపి ముఖం కడుక్కొని, అప్రమత్తమైన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, తమ పరిసరాల్లో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌ను సందర్శించిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 28: నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శుక్రవారం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌ను సందర్శించి నీటి ప్రవాహం, సాగునీటి సరఫరా పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహం, ప్రస్తుత సాగునీటి పరిస్థితులు, రైతులకు అందుతున్న నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట అధికారుల మధ్య సమన్వయంతో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు రైతులకు అవసరమైన సమయంలో నీరు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

పాములపాడు, మహి న్యూస్, ఆగస్టు 28 : రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పేదల సేవలో 2.0' మరియు స్టేట్ కాన్స్టిట్యూయెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్స్ (ఎస్‌సివిఎపియు), పి 4, పర్ఫామెన్స్ ఇండికేటర్స్ పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కార్యక్రమాలపై శుక్రవారం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నంద్యాల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్య పాటు సంబంధిత జిల్లా అధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గం విజన్ ప్లాన్ రూపొందించుకొని పనిచేయడం దేశంలోనే ప్రథమంగా ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. జిల్లాలో కార్యక్రమాల అమలు తీరు, ప్రజలకు అందుతున్న సేవలు, క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరాలు అందించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు చేరేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గాల అభివృద్ధిలో మరింత మెరుగైన పనితీరును కనబరచాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, నాలెడ్జ్ పార్ట్నర్ లు, యంగ్ ప్రొఫెషనల్స్ మరియు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి నియోజకవర్గం అభివృద్ధి మరియు పనితీరులో ముందంజలో నిలిచే విధంగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

## సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నాగబాబు

### ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్సీ నాగబాబు భేటీ

### ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

### నాగబాబుకు క్యాబినెట్ హోదా కల్పించిన ప్రభుత్వం

### 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచడమే లక్ష్యం



అమరావతి: జనసేన ఎమ్మెల్సీ, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయన సతీసమేతంగా ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు దంపతులను సీఎం చంద్రబాబు సత్కరించి, నూతన బాధ్యతలకు గాను శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు, మంగళగిరి లోని అరణ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగబాబు ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన తన అర్ధాంగి పద్మజతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పదవిని అలంకరించారు. ఈ పదవికి ప్రభుత్వం ఆయనకు క్యాబినెట్ హోదా కల్పించింది. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం అడవులు, చెట్లను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏపీ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నాగబాబుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు పీసీసీఎఫ్ పి.వి. చలపతి రావు, అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే సహా పలువురు అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యర్థాల నిర్వహణ కేంద్రాల నిర్మాణం వేగవంతం

### ప్రాసెసింగ్ చేసిన వ్యర్థాలను త్వరగా తరలించాలి

### బయో మైనింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, ఆగస్టు 28 (మహి న్యూస్): నగర శివార్లలోని గార్గేయపురం డంప్‌యార్డులో బయో మైనింగ్ ప్రక్రియ, వేస్ట్ టు ఎనర్జీ (డబ్ల్యుఈపీ), ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌డబ్ల్యుఎం) ప్లాంట్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సంబంధిత గుత్తేదారులను ఆదేశించారు. శుక్రవారం గార్గేయపురం డంప్‌యార్డులో పనుల పురోగతిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గార్గేయపురం, జోహారాపురం డంప్‌యార్డుల్లో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ ద్వారా రిమీడియేషన్ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటికే ప్రాసెసింగ్ చేసిన వ్యర్థాలు చివరి దశలో ఉన్నందున వాటిని త్వరితగతిన తరలించాలని సూచించారు. డంప్‌యార్డులో ఖాళీ అవుతున్న ప్రదేశాన్ని తదుపరి వ్యర్థాల నిర్వహణ అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెత్త డంపింగ్‌కు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో గార్గేయపురం డంప్‌యార్డులో 15 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో రూ.330 కోట్ల వ్యయంతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్లాంట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గుత్తేదారులను ఆదేశించారు. అదేవిధంగా ఆధునిక వ్యర్థాల నిర్వహణలో భాగంగా 9.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ 200 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసి పునర్వినియోగానికి అనువుగా మార్చేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు వినాయక ఘాట్ వద్ద సీసీ రహదారి, ప్యాచ్ వర్క్ పనులను కమిషనర్ పరిశీలించారు. వినాయక నిమజ్జనం నాటికి వినాయక ఘాట్‌ను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జోహరాపురం రోడ్డులో ఈ-ఆటోల పార్కింగ్, చార్జింగ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, వెహికల్ ఇన్‌చార్జి కురుబ మధుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, శివశంకర్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఉరుకుంద ఆలయ శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపట్టాలి

### 24 గంటల వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి



కర్నూలు, ఆగస్టు 28 (మహి న్యూస్): ఉరుకుంద ఆలయంలో జరగనున్న శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, పార్కింగ్, ట్రాఫిక్ తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఉరుకుంద ఆలయంలో జరగనున్న శ్రావణ మాస ఉత్సవాల నిర్వహణపై దేవాదాయ, పోలీస్, వైద్య, ఆర్ అండ్ బి, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. భక్తులకు తాగునీటి కొరత లేకుండా నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాల్లో రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగినన్ని ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆలయ ఈఓను ఆదేశించారు. ఉత్సవాల సమయంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని వైపుల నుంచి వచ్చే వాహనాల రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పార్కింగ్ స్థలాలు ఎక్కువగా ప్రైవేటు భూముల్లో ఉండటంతో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. శాశ్వత పార్కింగ్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదోని ఆర్డీవోను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థ, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సిబ్బంది, అగ్నిమాపక సేవలు తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు.

రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం కుప్పగల్లు--ఉరుకుంద సింగిల్ లేన్ రహదారిపై మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను నిరంతరం చేపట్టి భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కుప్పగల్లు--ఉరుకుంద, కోసిగి--ఉరుకుంద రహదారులను భవిష్యత్తులో డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. అదేవిధంగా ఉరుకుంద ఆలయానికి శాశ్వతంగా తాగునీటి సరఫరా అందించేలా పైప్‌లైన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సమయంలోనే కాకుండా భవిష్యత్తులోనూ ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శైలేశ్వర్, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, ఉరుకుంద ఆలయ ఈఓ వాణి, పోలీస్, వైద్య శాఖల అధికారులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## బాలసదనంలో ఆకస్మిక తనిఖీ.. సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరా

### పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అని పరిశీలన

### బయోమెట్రిక్ హాజరు, భద్రతా నిఘా వ్యవస్థపై అధికారుల దృష్టికి అంశాలు

### లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచన





కర్నూలు, ఆగస్టు 28 (మహి న్యూస్): పెద్దపాడులోని బాలసదనాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీల వెంకట శేషాద్రి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనలతో ఉదయం 8.15 గంటలకు బాలసదనాన్ని సందర్శించారు. తనిఖీ సమయంలో బాలసదనంలో సంబంధిత సిబ్బంది ఎవరూ విధుల్లో లేకపోవడం గుర్తించినట్లు కార్యదర్శి తెలిపారు. వంటమనుషులు శివమ్మ, మునెమ్మ పిల్లలకు అల్పాహారం అందిస్తుండగా, సుమలత, హెల్పర్ మాత్రమే విధుల్లో ఉన్నట్లు గుర్తించారు. పిల్లలకు నిర్ణీత మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు గుడ్లు అందించాల్సి ఉండగా, గుడ్లు అందించారా అనే అంశంపై వంటమనిషి శివమ్మను ప్రశ్నించారు. ఉదయమే పిల్లలకు గుడ్లు అందించామని ఆమె చెప్పగా, మరో వంటమనిషి మునెమ్మ మాత్రం గుడ్లు ఇంకా అందించలేదని, వాటిని ఉడకబెట్టాల్సి ఉందని తెలిపినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. అనంతరం పిల్లలను విచారించగా తమకు గుడ్లు అందించలేదని వారు తెలిపినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, బాలసదనంలోని పిల్లలు వాస్తవ విషయాలను బయటకు చెప్పకుండా కొంతమంది సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని, చెప్పినట్లయితే పిల్లలను మందలిస్తున్నారనే అంశం కూడా విచారణలో వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై ప్రశ్నించిన సమయంలో వంటమనిషి శివమ్మ పెద్ద స్వరంతో స్పందిస్తూ గుడ్లు ఇప్పటికే అందించామని పేర్కొన్నట్లు తెలిపారు. ఆమె విధులకు ఆలస్యంగా హాజరైన విషయాన్ని కూడా వెల్లడించినట్లు పేర్కొన్నారు. పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ, బాలల సంరక్షణ, అభివృద్ధికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తోందని కార్యదర్శి తెలిపారు. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.

భద్రతా చర్యలు మరింత పటిష్టం చేయాలి

సిబ్బంది హాజరును పర్యవేక్షించేందుకు బాలసదనంలో బయోమెట్రిక్ హాజరు పరికరాలు లేకపోవడాన్ని కూడా గుర్తించారు. అదే విధంగా పిల్లల భద్రత, పర్యవేక్షణకు అవసరమైన సరైన నిఘా వ్యవస్థ కూడా అందుబాటులో లేదని తెలిపారు. బాలసదనంలో గణనీయమైన సంఖ్యలో పిల్లలు నివసిస్తున్న నేపథ్యంలో వారి భద్రత, సంక్షేమం కోసం పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని కార్యదర్శి సూచించారు. బాలసదనం నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

### ఒక్క నెల--ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వినతుల స్వీకరణ

### నందవరం మండల కేంద్రంలో ప్రజల అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని ఆర్డీవో అరుణ దేవి



కర్నూలు, ఆగస్టు 28 (మహి న్యూస్): నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఒక్క నెల--ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నాలుగో పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా నందవరం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని రెవెన్యూ డివిజనల్ అధికారి అరుణ దేవి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరై తమ వ్యక్తిగత సమస్యలతో పాటు రెవెన్యూ, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం, గృహ వసతి, పింఛన్లు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆయా శాఖలకు పంపించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. అందిన ప్రతి వినతిపై నిర్ణీత కాలవ్యవధిలో చర్యలు చేపట్టి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన్న, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, జిల్లా రిజిస్ట్రార్ బజారి తదితర అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

